సాక్షి ఆదిలాబాద్

మంగళవారం, 10, సెప్టెంబర్, 2024

ఉచిత శిక్షణ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నర్సింగ్ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణ అందించనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ సరిత ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రథమ్ కేర్ శిక్షణ కేంద్రంలో రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9000203952 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు చాకలి ఐలమ్మ వర్ధంతి

కైలాస్‌నగర్: తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఎదుట గల ఐలమ్మ విగ్రహం వద్ద మంగళవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి రజక కులస్తులు, బీసీ సంఘాల ప్రతినిధులు, బీసీలు అధికసంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

గరిష్టం/కనిష్టం
28.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తుపాను ప్రభావంతో పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన ఎమ్మెల్యే శంకర్



సీఎంకు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సోమవారం సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని కలిసి రైతు సమస్యలపై వినతిపత్రం అందించారు. పెన్‌గంగ పరీవాహక ప్రాంతంలో వరద పోటెత్తి పత్తి, సోయాబీన్, కంది పంటలు నీట మునిగి రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. పెట్టుబడి సైతం వచ్చే పరిస్థితి లేదన్నారు. ఫసల్ బీమా పథకాన్ని అమలు పరచాలని విన్నవించారు. రైతు సమస్యల పరిష్కారంపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఉట్నూర్ సబ్ కలెక్టర్‌గా యువరాజ్ బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న యువరాజ్ మర్మాట్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ సబ్‌కలెక్టర్‌గా యువరాజ్ మర్మాట్ ఆర్డీవో కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఐటీడీఏ పీవోగా ఇప్పటికే ఐఏఎస్ అధికారి కొనసాగుతుండగా తాజాగా సబ్ కలెక్టర్‌గా ఐఏఎస్ స్థాయి అధికారి రావడంతో ఏజెన్సీ ప్రాంతంలో పర్యవేక్షణ మెరుగుకానుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆదివాసీ, గిరిజనుల సమస్యలు సత్వర పరిష్కారం అయ్యే అవకాశముంటుందని తెలుస్తోంది.

12న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈనెల 12న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, రాజేశ్ ప్రకటనలో పేర్కొన్నారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. అర్హత గల క్రీడాకారులు గురువారం ఉదయం 9 గంటలకు పోటీల ఆర్గనైజర్లకు రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు 9704944283 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు



మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం

ఇచ్చోడ: చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, జైనూర్ ఘటనలో బాధిత మహిళకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చోడ, గుడిహత్నూర్, సిరికొండ, నేరడిగొండ మండలాల ఆదివాసీలతో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. బాధిత మహిళకు ప్రత్యేక వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందన్నారు. అందరూ సంయమనం పాటించాలని కోరారు. జిల్లాలో 30 యాక్టు అమల్లో ఉన్నందున రాస్తారోకోలు, ధర్నాలు చేయవద్దని సూచించారు. ఇందులో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, ఇచ్చోడ సీఐ భీమేశ్, ఎస్సైలు నరేశ్, శ్రీకాంత్, ఆదివాసీలు పాల్గొన్నారు.

బంగారం కావాలా.. నాయనా

- మార్కెట్ కంటే అగ్గువ ధరకే..
- తులానికి రూ.15వేల వరకు తక్కువ!
- ఆర్మూర్ నుంచి కొనుగోలు
- బోథ్ కేంద్రంగా విక్రయాలు
- నాణ్యతపై అనుమానాలు..
- నాలుగేళ్లుగా అక్రమ దందా
- రూ.2 కోట్ల అడ్వాన్స్ ఎగ్గొట్టడంతో తెరపైకి పంచాయితీ



సాక్షి, ఆదిలాబాద్: లడ్డూ కావాలా.. నాయనా.. ఇది ఓ కంపెనీ చాక్లెట్‌కు సంబంధించిన యాడ్. దీంట్లో ఓ వ్యక్తికి ఆ చాక్లెట్ తినడం ద్వారా ఒక ప్రయోజనంతో పాటు అయాచితంగా అదనపు మేలు దక్కడం చూస్తుంటాం. ఇది కూడా అలాంటి కోవదే. తక్కువ ధరకే బంగారం.. ఆపై టాక్స్ పడకుండా ఉండే ప్రయోజనాన్ని అందుకోండంటూ.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓ ముఠా అక్రమ విక్రయాలకు తెరలేపింది. ఏకంగా నాలుగేళ్లుగా ఈ దందా నడిపింది. ఇంకా నడిచేది.. అయితే వారి బ్యాడ్‌లక్ ఏంటంటే.. బంగారం కొనుగోలు కోసం అడ్వాన్స్‌గా ఓ వ్యక్తికి రూ.2 కోట్లు ఇస్తే.. అతను ఆ గోల్డ్ ఎగ్గొట్టడంతో వారి బ్యాడ్‌టైమ్ స్టార్ట్ అయ్యింది. ఆ డబ్బులను తిరిగి ఇవ్వాలంటూ, లేనిపక్షంలో గోల్డ్ అయినా ఇవ్వాలని వారు సదరు వ్యక్తితో పలుచోట్ల పంచాయితీ పెట్టడంతో విషయం నలుగురికి తెలిసి దావానంలా వ్యాపించింది. అయితే ఈ వ్యవహారంలో ఇప్పటివరకు వినియోగదారుల నుంచి ఫిర్యాదు లేకపోవడంతో గొడవ పెద్దది కాలేదు. మరోవైపు అక్రమ బంగారం విక్రయంలో ప్రభుత్వానికి పన్ను ఎగ్గొట్టిన విషయమై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి వ్యవహారాన్ని బట్టబయలు చేయాల్సి ఉండగా సైలెంట్‌గా ఉండడం అనుమానాలకు తావిస్తోంది.

ఆదిలాబాద్ జిల్లా బోథ్‌కు చెందిన హార్డ్‌వేర్ షాప్ నడిపే వ్యాపారులతో పాటు మరికొంత మంది కలిసి నాలుగేళ్లుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బంగారం అక్రమ విక్రయాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 5 నుంచి 8 కిలోల వరకు విక్రయాలు చేశారని ప్రచారం సాగుతుంది. గోల్డ్‌ను కాయిన్స్ రూపంలో తక్కువ ధరకే ఇస్తామంటూ వినియోగదారులను బుట్టలో వేసుకుంటూ ఈ దందా సాగించారు. 10 గ్రాములకు మార్కెట్ ధర కంటే రూ.10వేల నుంచి రూ.15వేల వరకు తక్కువకే ఇవ్వడంతో జనం కూడా కొనుగోలు చేశారని చెప్పుకుంటున్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన ఓ మాజీ సర్పంచ్ బోథ్‌కు చెందిన ముఠాకు బంగారాన్ని తక్కువ ధరకు అందజేయడం, ఈ ముఠా వినియోగదారులకు అంటగట్టడం వంటి చర్యలు ఏళ్లుగా నడుపుకుంటూ వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇటీవల సడన్‌గా వీరి దందాకు బ్రేక్ పడింది. ఈ ముఠా ఆర్మూర్ నుంచి బంగారం కొనుగోలు కోసం మాజీ సర్పంచ్‌కు రూ.2 కోట్లు అడ్వాన్స్‌గా ఇచ్చారు. అయితే గోల్డ్ ఇవ్వకుండా అతను ఎగ్గొట్టాడు. అంతే కాకుండా అతను ఐపీ పెట్టడంతో వీరు డబ్బులు వసూలు చేయలేని పరిస్థితి నెలకొందనే ప్రచారం సాగుతుంది. ఆ వ్యక్తిని డబ్బులు, లేనిపక్షంలో బంగారం ఇవ్వాలంటూ నిజామాబాద్, ఆర్మూర్, బోథ్ ప్రాంతాల్లో పంచాయితీలు సైతం పెట్టినప్పటికీ ఎలాంటి ప్రయోజనం దక్కలేదని తెలుస్తోంది. ఈ విషయం బయటకు పొక్కడం, అందరిలో చర్చకు దారి తీసింది.

ప్రమాణాలు ఇలా..

జిల్లాలో జుయలరీ దుకాణాలు ఉన్నప్పటికీ బంగారు ఆభరణాల విక్రయాలు నామమాత్రంగానే సాగుతాయి. ఇలాంటి షాపులు జిల్లా కేంద్రంతో పాటు కొన్ని ప్రాంతాల్లో ఉన్నాయి. వారు బంగారం విక్రయాల పరంగా వాణిజ్య పన్నుల శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. టర్నోవర్ అధికంగా ఉన్న షాపులు ఐటీలో లావాదేవీలు పూర్తిగా చూపించాలి. విక్రయాలు అధికంగా జరిగే చోట బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) హాల్‌మార్క్ ఉండాల్సిందే. వినియోగదారులు మెటల్ స్వచ్ఛతను దీని ద్వారా నిర్ధారిస్తారు. అయితే ఇవన్నీ లేకుండా ఏళ్లుగా అక్రమ దందా చేస్తున్నప్పటికీ వారిని నియంత్రించడంలో ఆయా వ్యవస్థలు విఫలమయ్యాయన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

అది ఎలాంటి బంగారం..

ఈ విషయంలో పోలీసులు ఇప్పటివరకు జోక్యం చేసుకోకపోవడం, ఇటు బంగారం కొనుగోలు చేసిన వినియోగదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదు లేకపోవడంతో ఇన్నాళ్ల పాటు సాగిన అక్రమ విక్రయాల వ్యవహారం ఇంకా పూర్తిస్థాయిలో వెలుగులోకి రావడం లేదు. అయితే వారు అమ్మిన బంగారం.. జీరోలో కొనుగోలు చేసిందా.. దొంగతనం చేసిన వారు విక్రయించిందా.. తక్కువ నాణ్యత గలదా.. అనే విషయంలో సందిగ్ధం నెలకొంది. పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి ఈ వ్యవహారాన్ని పూర్తిస్థాయిలో బయటకి తీసుకొస్తే ముందుముందు ఇలాంటి అక్రమ విక్రయాలకు చెక్ పెట్టినట్లు అవుతుందన్న అభిప్రాయం అందరిలో వ్యక్తమవుతుంది.

నా దృష్టికి రాలేదు..

బోథ్ కేంద్రంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బంగారం అక్రమ విక్రయాలు జరుగుతున్నట్లు నా దృష్టికి రాలేదు. విషయాన్ని తెలుసుకుంటాను. ఎవరైనా అక్రమంగా బంగారం విక్రయాలు జరిపినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవు. – గౌస్ ఆలం, ఎస్పీ

కొరడా..

- జిల్లాలో 40 ప్రైవేట్ ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు
- కలెక్టర్ ఆదేశాలతో వైద్యశాఖ ముమ్మర తనిఖీలు



జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయి. ధనార్జనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాయి. కనీస వసతులు లేకపోయినప్పటికీ రోగుల నుంచి వేలల్లో ఫీజులు వసూలు చేస్తూ అందినకాడికి దండుకుంటున్నాయి. అంతేకాకుండా అర్హతలు లేని వారి తో ల్యాబ్‌లు, మెడికల్ షాపులను ఆస్పత్రులకు అనుబంధంగా నిర్వహిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ గత నెల 20న పట్టణంలోని ఓ ఆస్పత్రిని తనిఖీ చేశారు. అనంతరం వైద్యారోగ్య శాఖ అధికారులతో సమావేశమై తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆ శాఖ అధికారులు రంగంలోకి దిగారు.

నోటీసులు సరే.. చర్యలేవి?

వైద్యశాఖ అధికారులు తనిఖీలకే పరిమితం అవుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గతంలో సైతం పలు ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని వారికి షోకాజ్ నో టీసులు జారీ చేసినప్పటికీ ఎలాంటి చర్యలకు పూనుకోలేదు. ఇటీవల కలెక్టర్ ఆదేశాలతో ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేస్తున్నప్పటికీ చర్యలకు వెనుకాడుతున్నారనే ప్రచారం సాగుతుంది. జిల్లాలో 144 ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు ఉన్నాయి. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారితో పాటు ఎనిమిది మంది ప్రోగ్రాం అధికారులు తనిఖీలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీల సమయంలో ఆస్పత్రిలో ఫీజులకు సంబంధించిన బోర్డు ఏర్పాటు చే యకపోవడం, బయోమెడికల్ వేస్టేజ్ లేకపోవడం, ఫైర్‌సేఫ్టీ పాటించకపోవడం, ఐఈసీ మెటీరియల్, ఆస్పత్రుల్లో నియమించిన సిబ్బందికి అర్హత లేకపోవడం, మరికొన్ని ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ లేకపోవడం, కంట్రోల్ బోర్డు నుంచి పొల్యూషన్ సర్టిఫికె ట్ లేకపోవడం, విజిట్ డాక్టర్‌కు సంబంధించిన వివరాలను వైద్య శాఖ అధికారి కార్యాలయంలో నమోదు చేయకపోవడంతో పాటు ఇతర లోపాలు సైతం తేటతెల్లం అయ్యాయి. అయితే నిబంధనలు పాటించని ఆస్పత్రులకు నోటీసులు జారీ చేసి మూడు రోజుల్లో మరోసారి తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆ తర్వాత వారు లోపాలను సరిదిద్దుకోకపోతే సీజ్‌చేయాలని సూచించారు. కానీ షోకాజ్ జారీ చేయడమే తప్పా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని పలువురు పేర్కొంటున్నారు.

40 ఆస్పత్రులకు షోకాజ్

ఆదిలాబాద్ పట్టణంతో పాటు ఉట్నూర్, ఇచ్చోడ, బోథ్ తదితర ప్రాంతాల్లో క్లినిక్‌లు ఏర్పాటు చేసి ఆస్పత్రులను నిర్వహిస్తున్నారు. ఇందులో అధిక శాతం మంది ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులే ఉండటం గమనార్హం. ఉదయం నుంచి సాయంత్రం వరకు విధుల్లో ఉండాల్సిన చాలా మంది వైద్యులు మధ్యాహ్నమే ప్రైవేట్ క్లినిక్‌ల బాట పడుతున్నారు. అయితే గతనెల 21 నుంచి ఈనెల 9వరకు 40 ప్రైవేట్ ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు వైద్య శాఖ అధికారులు చెబుతున్నారు. ఒక్క సోమవారమే 20 నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అయితే ఈ క్లినిక్‌లో పనిచేసే వైద్యులు వీరికి సుపరిచితులుగా ఉండటం, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే పనిచేసిన వారు అధికంగా ఉండడంతో చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కలెక్టర్ ఆదేశాలు సైతం బేఖాతరు చేస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు.

వివరణ అనంతరం చర్యలు..

కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేస్తున్నాం. జిల్లాలో మొత్తం 144 రిజిస్ట్రేషన్ అయి ఉన్నాయి. వీటిలో ఎనిమిది మంది ప్రోగ్రాం అధికారులతో తనిఖీలు చేపడుతున్నాం. ఇప్పటివరకు 40 ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేశాం. పలువురు వివరణ ఇచ్చారు. మరికొంత మంది నిర్వాహకుల వివరణ అనంతరం శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. – కృష్ణ, డీఎంహెచ్‌వో

నవరాత్రోత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. పట్టణంలోని సెంట్రల్‌గార్డెన్‌లో వినాయకమండపాల నిర్వాహకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది 24 గంటల పాటు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు అమర్చుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అత్యవసర సమయంలో పోలీసుల సాయం కోసం 8712659906 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి సెక్టార్‌కు ఎస్సై స్థాయి అధికారిని నియమించినట్లు పేర్కొన్నారు. అదనంగా 12 ఫుట్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. డీజేకు అనుమతి లేదని, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. ఇందులో అదనపు ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీలు జీవన్ రెడ్డి, శ్రీనివాస్, సీఐలు సునీల్ కుమార్, కరుణాకర్, ఫణిందర్, ప్రణయ్‌కుమార్, శ్రీనివాస్, ఎస్సైలు ముజాహిద్, విష్ణువర్ధన్, ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

లింగాపూర్‌లో విధులు నిర్వహిస్తూ జూలైలో అనారోగ్యంతో మరణించిన ఏఎస్సై నైతం నారాయణ కుటుంబ సభ్యులకు ఎస్పీ సోమవారం చెక్కు అందజేశారు. 1989 పోలీసు బ్యాచ్ మిత్రులు జమ చేసిన రూ.50వేల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇందులో కోర్టు లైజన్ అధికారులు తాజొద్దీన్, ఈశ్వర్‌సింగ్ తదితరులు ఉన్నారు.

కాళోజీ జీవితం స్ఫూర్తిదాయకం

- అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

కైలాస్‌నగర్: కాళోజీ జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. కాళోజీ నారాయణరావు జయంతి కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం అధికారికంగా నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తన రచనల ద్వారా ప్రజల హక్కుల కోసం ఉద్యమించిన పోరాట యోధుడు కాళోజీ అని కొనియాడారు. తెలంగాణ మాండలికానికి ఆయన నిలువెత్తు నిదర్శనమన్నారు. ఇందులో ట్రెయినీ కలెక్టర్ అభిఘ్యాన్ మాల్వియా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్ రావు, వయోజన విద్యాశాఖ డీడీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

భాషా అభివృద్ధికి కాళోజీ కృషి

ఆదిలాబాద్‌టౌన్: ప్రజాకవి, సాహితీవేత్త కాళోజీ నారాయణరావు భాషా అభివృద్ధికి చేసిన కృషి ఎనలేనిదని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా కాళోజీ జయంతి వేడుకలను పోలీసు ముఖ్య కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజా హక్కుల కోసం కాళోజీ ఉద్యమించారని తెలిపారు. ఇందులో అదనపు ఎస్పీ సురేందర్ రావు, డీఎస్పీ పోతారం శ్రీనివాస్, పోలీసు కార్యాలయ ఏవో భక్త ప్రహ్లాద, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీలకు తీపికబురు

- ఒక్కో సభ్యురాలికి రెండేసి చీరలు అందించాలని ప్రభుత్వ నిర్ణయం
- జిల్లాలో 1,41,490 మందికి లబ్ధి

జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ పరిధిలో..	
స్వయం సహాయక సంఘాలు	10,784
ఇందులో సభ్యులు	1,17,490
మున్సిపల్ పరిధిలో (అర్బన్ మండలంలో)	
స్వయం సహాయక సంఘాలు	2,400
ఇందులో సభ్యులు	24 వేలు

కైలాస్‌నగర్: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వారిని ఆర్థికంగా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఇప్పటికే మహిళాశక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. తాజాగా వారికి ఏటా రెండు చీరలు ఉచితంగా అందజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అయితే గత ప్రభుత్వం బతుకమ్మ కానుకగా ఆడపడుచులకు చీరలను ఉచితంగా అందజేసేది. దీనిపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం.

1,41,490 మంది సభ్యులకు లబ్ధి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్‌హెచ్‌జీ మహిళలకు ప్రాధాన్యతనిస్తోంది. వారు స్వయం సమృద్ధి సాధించే దిశగా మహిళాశక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. తాజాగా వా రికి ఇక నుంచి ఏటా రెండు చీరలను సైతం ప్ర భుత్వపరంగా ఉచితంగా అందజేస్తామని హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ నిర్ణయంతో జిల్లా వ్యాప్తంగా 1,41,490 మంది సభ్యులకు లబ్ధి చేకూరనుంది.



ఎస్‌హెచ్‌జీ సభ్యులు (ఫైల్)

బతుకమ్మ కానుకలపై స్పష్టత కరవు

బతుకమ్మ పండుగ పురస్కరించుకుని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏటా 18ఏళ్ల నిండి, రేషన్‌కార్డు కలిగిన మహిళలు, యువతులందరికీ చీరలను కానుకగా అందజేసేది. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కానుకలను కొనసాగిస్తుందా లేదా అనే దానిపై సందిగ్ధం నెలకొంది. పండుగకు మరో నెల సమయం ఉండటంతో అప్పటి వరకు ప్రభుత్వం ఏదైనా నిర్ణయాన్ని ప్రకటించే అవకాశమున్నట్లుగా అధికారులు చెబుతున్నారు.

అర్జీలపై అలసత్వం వద్దు

- అదనపు కలెక్టర్ శ్యామలాదేవి
- గ్రీవెన్స్‌లో దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: ప్రజావాణిలో అందించే అర్జీలపై అలసత్వం వహించకుండా వెంటనే పరిష్కరిస్తూ బాధితులకు భరోసా కల్పించాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేస్తూ సత్వరం పరిష్కరించేలా శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ వారం 92 అర్జీలు అందినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో ట్రెయినీ కలెక్టర్ అభిఘ్యాన్ మాల్వియా, డీఆర్డీవో సాయన్న, ఆర్డీవో వినోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ వారం అర్జీదారుల్లో కొందరి నివేదన.



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

కొడుకులను కోల్పోయాం..



మాది నిరుపేద కుటుంబం. అద్దె ఇంట్లో ఉంటూ కూలీనాలి చేసుకుని బతుకుతున్నాం. ఈ క్రమంలో గత నెల 27న చేపల వేటకని వెళ్లిన మా ముగ్గురు కొడుకులు పొచ్చెర వాగులో కొట్టుకుపోయి చనిపోయారు. అందిరికీ పెండ్లిళ్లయ్యాయి. అందులో ఓ కొడుకుకు పది నెలల బాబు ఉన్నాడు. కోడళ్లతో పాటు బాబును పోషించే ఆర్థికస్థోమత మాకు లేదు. ప్రస్తుతం కప్పర్లలోని తమ్ముడి ఇంట్లో ఉంటున్నాం. మమ్మల్ని కరుణించి గృహ సదుపాయంతో పాటు మా కోడళ్లకు పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి. – నాగల్‌వాడి మీన-రాజు దంపతులు, బండల్‌నాగాపూర్, తాంసి

కుంటను కబ్జా చేస్తున్నారు



మా గ్రామంలోని సర్వేనంబర్ 18లో 3.15 ఎకరాల విస్తీర్ణంలో కుంట ఉంది. 52 మంది మత్స్యకారులం అందులో చేపలు పట్టుకుని జీవనోపాధి పొందుతున్నాం. అలాంటి కుంటపై కన్నేసిన కొంతమంది కబ్జా చేస్తున్నారు. ఇప్పటికే కొంత ఆక్రమించుకున్నారు. మిగతాది కూడా హస్తగతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అధికారులు సర్వే చేయించి తగు చర్యలు తీసుకోవాలి. – మత్స్యకారులు, బండల్‌నాగాపూర్, తాంసి

ఆ వేతనాలు అందట్లేదు..



ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో 2023-24 సంవత్సరానికి గాను పత్తి కొనుగోళ్ల సందర్భంగా తేమశాతం పరిశీలించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు 16 మంది వీవోఏలం మూడు నెలల పాటు విధులు నిర్వహించాం. ఎనిమిది నెలలు గడిచినా ఇప్పటి వరకు ఆ వేతనాలు చెల్లించలేదు. అలాగే 2019-20లో కూడా విధులు నిర్వహించాం. వాటికి సంబంధించిన బకాయిలు కూడా చెల్లించలేదు. విచారణ జరిపించి న్యాయం చేయాలి. – ఏఎంసీ వీవోఏలు, ఆదిలాబాద్

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

బేల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో కృష్ణ అన్నారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీని సోమవారం ఆయన తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను వైద్యాధికారి వంశీకృష్ణను అడిగి తెలుసుకున్నారు. నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా మలేరియా అధికారి శ్రీధర్, హెచ్‌ఈవో జావిద్, మెడికల్ సూపర్‌వైజర్ సుశీల ఉన్నారు.

క్లుప్తంగా

పాముకాటుతో వృద్ధురాలి మృతి



వివరాలు నమోదు చేస్తున్న ఏఎస్సై అభిబ్

జైపూర్: మండలంలోని వెంక్రటావుపల్లికి చెందిన వృద్ధురాలు దుర్గం శివమ్మ(77) పాముకాటుతో మృతి చెందిందని ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. వెంక్రటావుపల్లిలో తన కుమార్తె గోదారి పద్మ ఇంటి వద్ద శివమ్మ ఉంటుంది. ఆదివారం రాత్రి అన్నం తిని అందరూ నిద్రించారు. మంచంపై నిద్రిస్తున్న శివమ్మను సోమవారం వేకువజామున పాము కాటు వేసింది. తన చేతికి ఏదో కుట్టిందని కుమార్తె పద్మను లేపగా ఆమెకు, అల్లుడు లక్ష్మణ్ చుట్టుపక్కల ఏమి కనిపించలేదు. శివమ్మ నోటి నుంచి నురుగులు రావడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బురద గుంటలో పడి వ్యక్తి..



షేక్ హుస్సేన్ మృతదేహం

సిర్పూర్(టి): మద్యం మత్తులో ఇంటికి వెళ్లే దారిలో బురద గుంటలో పడి వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై కమలాకర్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని కొత్తకాలనీలో నివాసం ఉంటున్న షేక్ హుస్సేన్ (45) ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. కొన్నేళ్ల క్రితమే భార్యతో విడాకులైంది. కొత్తకాలనీలో తన సోదరి సాబెరా బేగం ఇంట్లో ఉంటున్నాడు. హుస్సేన్ మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి అతిగా మద్యం తాగి ఇంటికి వచ్చి తిరిగి బీడీ తెచ్చుకుంటానని బయటకు వెళ్లాడు. ఇంటికి రాకపోయేసరికి ఎక్కడైన నిద్రపోయాడని సోదరి అనుకుంది. కొత్తకాలనీ ప్రధాన రహదారి నుంచి ఇంటి వెళ్లేదారిలో బురద గుంటలో హుస్సేన్ పడిపోయాడు. సోమవారం ఉదయం కాలనీవాసులు గుర్తించి సోదరికి సమాచారం అందించారు. సాబెరాబేగం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో చికిత్సపొందుతూ ఒకరు మృతి చెందినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా హిరాపూర్ చెందిన ధన్‌లాల్ బావుసింగ్ (46) భార్య ఎనిమిది నెలల క్రితం మృతి చెందింది. మానసికంగా కుంగిపోయిన బావుసింగ్ ఈనెల 7న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు అతన్ని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
BUSINESS OFFER

■ ICF కార్పొరేషన్ అగ్రికల్చర్ పర్సనల్ ఎడ్యుకేషన్ ప్రాపర్టీ పై లోన్స్ ఏజెంట్స్ DMA కావలెను. జీతం+ కమీషన్. ఫోన్ : 7988242391 [SCA-24000238]

WANTED

■ త్రినేత్రహోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ : 17K. Ph : 8520874499, 8520980099 [H-796274]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

ప్రతిభ ఉంటే రూ.పది లక్షలు మీవే!

- 'ఆర్బీఐ 90'పేరిట క్విజ్‌పోటీలు
- 25 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులు
- జిల్లా, రాష్ట్ర, జోనల్, జాతీయస్థాయిల్లో పోటీలు
- ఈనెల 17 వరకు దరఖాస్తులకు గడువు
- ఆర్థిక అక్షరాస్యత పెంపొందించడమే లక్ష్యం



ఆన్‌లైన్ దరఖాస్తు హోమ్ పేజీ ఇదే

నిర్మల్‌ఖిల్లా: విద్యార్థులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అద్భుతమైన అవకాశం కల్పిస్తోంది. ఆర్బీఐ 90వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా దేశవ్యాప్తంగా డిగ్రీ, పీజీ విద్యార్థులకు 'ఆర్బీఐ 90 క్విజ్'పేరిట జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తోంది. ఇప్పటికే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 17వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునేందుకు గడువు ఉంది. ఈనెల 19 నుంచి 21 వరకు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు పోటీలు జరగనున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులు పాల్గొనవచ్చు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చితే రూ.10 లక్షలు గెలుచుకునే అవకాశం ఉంది.

దరఖాస్తు విధానం ఇలా...

2024 సెప్టెంబర్ 1 నాటికి 25 ఏళ్లలోపు వయసు ఉండి ఏదైనా కళాశాలలో డిగ్రీ చదువుతున్నవారు పోటీల్లో పాల్గొనవచ్చు. www. rbi90 quiz. in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 17లోగా దరఖాస్తులు చేసుకోవచ్చు. గుర్తింపు కార్డ్, ఈమెయిల్ ఐడీ, ఫోన్ నెంబర్, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేయాలి. ఇందుకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. ఒక్కో కళాశాల నుంచి ఎంతమంది అయినా దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో బృందానికి ఇద్దరు విద్యార్థులు ఉండాలి. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ బి.రాంగోపాల్, నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ కోరుతున్నారు.

నాలుగు దశల్లో..

నాలుగు దశల్లో ఆర్బీఐ క్విజ్ పోటీలు జరగనున్నాయి. జిల్లా స్థాయి, రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయిలో పోటీలు ఉంటాయి. మొదటి రౌండ్‌లో ఆన్‌లైన్‌లో జరుగుతుంది. ఇందులో 36 మల్టీపుల్ ప్రశ్నలు ఉంటాయి. 15 నిమిషాల్లో సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. ఇద్దరు విద్యార్థుల జతతో ఒకే పరికరం (ఫోను, టాబ్లెట్, లాప్‌టాప్, కంప్యూటర్) ద్వారా పోటీల్లో పాల్గొనాలి.

- విద్యార్థుల్లో ఆర్బీఐ ఆర్థిక వ్యవస్థ గురించి అవగాహన, డిజిటల్ లావాదేవీలు, సురక్షిత బాధ్యతాయుత వినియోగం తదితర వాటి గురించి యువతలో ప్రోత్సహించే లక్ష్యంతో ఈ క్విజ్‌పోటీలు నిర్వహిస్తోంది.
- దేశ, అంతర్జాతీయ, ఆర్థిక వ్యవహారాలు, ఆర్బీఐ చారిత్రక నేపథ్యం, ఆర్థిక వ్యవస్థ, క్రీడలు, చరిత్ర సాహిత్యం, శాస్త్ర సాంకేతిక రంగాలు, సమకాలీన అంశాలపై హిందీ, ఆంగ్లభాషల్లో ప్రశ్నలు ఉంటాయి.
- జిల్లాస్థాయి ఆన్‌లైన్ పోటీల్లో విజేతగా ఎంపికైన వారికి తదుపరి పోటీలకు హాజరయ్యేందుకు రవాణా, వసతి తదితర ఖర్చులను ఆర్బీఐ భరిస్తుంది. సంబంధిత కళాశాల అధ్యాపకుడు కూడా ఎంపికైన విద్యార్థులతోపాటు వెళ్లే అవకాశం కల్పిస్తుంది.

నగదు బహుమతుల వివరాలు

స్థాయి	ప్రథమ	ద్వితీయ	తృతీయ
రాష్ట్ర	రూ.2లక్షలు	రూ.1.50లక్షలు	రూ.లక్ష
జోనల్	రూ.5లక్షలు	రూ.4లక్షలు	రూ.3లక్షలు
జాతీయ	రూ.10లక్షలు	రూ.8లక్షలు	రూ.6లక్షలు

తాళం వేసిన రెండిళ్లలో చోరీ



జన్నారంలో క్లూస్ టీంతో పరిశీలిస్తున్న సీఐ



ఆదర్శనగర్‌లో పగులగొట్టిన ఇంటి తాళం

జన్నారం/నిర్మల్‌టౌన్: తాళం వేసిన రెండిళ్లలో దొంగలు పడి చోరీకి పాల్పడిన ఘటన జన్నారం, నిర్మల్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. జన్నారం మండలకేంద్రంలో రామ్‌సింగ్ రాజ్ పురోహిత్.. ఎలక్ట్రికల్, హార్డ్ షాపు నిర్వహిస్తున్నాడు. షాపు పైన ఇల్లు ఉంది. ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి సొంత పనిపై కుటుంబ సభ్యులతో కలిసి మంచిర్యాల వెళ్లాడు. తిరిగి తెల్లవారు జాము 3 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. చూసేసరికి తాళం పగులగొట్టి బీరువాలో 4 తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండిని దొంగలు ఎత్తుకెళ్లారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం లక్సెట్టిపేట సీఐ నరేందర్, ఎస్సై రాజవర్ధన్ ఘటన స్థలానికి చేరుకున్నారు. క్లూస్‌టీంతో ఫింగర్ ప్రింట్‌లు సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆదర్శనగర్‌లో..

నిర్మల్‌లోని ఆదర్శనగర్‌లో ఇంటికి తాళం వేసి శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో కలిసి బర్త్ డే వేడుకల కోసం బంధువుల ఇంటికి వెళ్లారు. నాలుగు రోజుల తర్వాత సోమవారం ఇంటికి తిరిగి వచ్చారు. చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో రూ.30 వేల నగదు, 3 తులాల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారని బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సరస్వతీ అమ్మవారి సన్నిధిలో పూజలు



కుటుంబ సభ్యులతో అనిల్‌కుమార్

బాసర: శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారిని రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ చీఫ్ గుమ్మడి అనిల్ కుమార్ కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనిల్ కుమార్ మనమరాలికి అర్చకులతో అన్నప్రాసన చేయించారు. ముందుగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్ వారికి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం అనిల్ కుమార్‌కు బాసర లిఫ్ట్ ఇరిగేషన్ సమస్యను మాజీ సర్పంచ్ రమేశ్ వివరించారు. వెంటనే ఆయన స్పందించి రూ.20 కోట్ల వరకు ప్రతిపాదనలు చేసి పంపాలని డీఈ, జేఈలను ఆదేశించారు. వీరి వెంట ఏఈఈ రమేశ్, రజనీకాంత్, నాగరాజు ఉన్నారు.

చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య

లోకేశ్వరం: చెరువులో దూకి వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన సుంకరి సాయవ్వ (45)–విఠల్ భార్యభర్తలు. వీరిద్దరు పుస్పూర్‌లో పాలేరుగా పని చేస్తున్నారు. కొంత కాలంగా సాయవ్వకు మతిస్థిమితం లేక తిరుగుతుండేది. ఈనెల 6న ఆమె కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. వారు ఫిర్యాదుతో పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. అప్పటి నుంచి సాయవ్వ ఆచూకీ కోసం గాలిస్తుండగా పుస్పూర్ గ్రామంలోని చెరువులో శవమై సోమవారం కనిపించింది. మృతురాలు చెల్లెలు రామేలి అనురాధ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పురుగుల మందు తాగి వృద్ధుడు..



చిన్న భూమన్న మృతదేహం

జైనథ్: మండల కేంద్రానికి చెందిన వృద్ధుడు అల్లకొండ చిన్న భూమన్న (64) గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై పురుషోత్తం కథనం ప్రకారం.. చిన్న భూమన్న గత ఐదేళ్లుగా ఆస్తమాతో బాధపడుతున్నాడు. కుటుంబీకులు అతన్ని పలు ఆసుపత్రుల్లో చూపించినా నయం కాలేదు. ఈనెల 7న రాత్రి భూమన్నకు శ్వాస తీసుకోవడం ఇబ్బంది అయింది. దీంతో జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు ఆయన్ను వెంటనే 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుమారుడు గణేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థికి పాముకాటు

- సకాలంలో చికిత్సతో తప్పిన ప్రాణాపాయం



చికిత్స పొందుతున్న విద్యార్థి యశ్వంత్

తాంసి: భీంపూర్ మండలం ధనోర ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థికి పాముకాటు వేసింది. ఒకటవ తరగతి చదువుతున్న మామిడి యశ్వంత్ తోటి విద్యార్థులతో కలిసి సోమవారం మధ్యాహ్నం పాఠశాల వరండాలో చివరన కూర్చున్నాడు. వరండాలో టైల్స్ కింద ఉన్న రంధ్రం నుంచి వచ్చిన పాము యశ్వంత్ కాలిపై కాటేసింది. తోటి విద్యార్థులు ఈ విషయాన్ని ఉపాధ్యాయులకు చెప్పారు. టీచర్ సురేశ్ ఆ విద్యార్థికి పాము కాటేసిన చోట నోటితో రక్తాన్ని తీసి కాలికి దారం కట్టాడు. ఆ టీచర్, హెచ్‌ఎం హన్మాండ్లు బైక్‌పై విద్యార్థిని భీంపూర్ పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పాముకాటు మందు ఉన్నా వైద్యాధికారి అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. సకాలంలో చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

బాసర ఆలయం చుట్టూ సోలార్ కంచె



బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ ప్రాంగణం చుట్టూ సోమవారం సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటు చేశారు. ఇటీవల ఓ దొంగ ఆలయం లోపలికి చొరబడి చోరీకి పాల్పడిన విషయం తెలిసిందే. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ఆలయం చుట్టూ సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటు చేశారు. ఆలయ భద్రతకు సంబంధించి ఎస్సై గణేశ్, పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

ఉద్యమకారుల ఫోరం ఉపాధ్యక్షుడిగా 'పాకాల'



నియామకపత్రం అందుకుంటున్న రాంచందర్

నిర్మల్‌టౌన్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పాకాల రాంచందర్ నియమితులయ్యారు. జిల్లాకేంద్రంలో ఆయనకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ సోమవారం నియామకపత్రం అందజేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్ కొట్టే శేఖర్, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రామకష్ణ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి సామకిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒకేసారి రెండు సర్కారు కొలువులు



కుటుంబ సభ్యులతో సాయిస్నేహిత్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పిల్లి కిషన్–శోభ దంపతుల కుమారుడు సాయిస్నేహిత్ రెండు ప్రభుత్వ కొలువులకు ఎంపికయ్యాడు. వినాయక చవితి రోజున టీఎస్ జెన్కో నిర్వహించిన పరీక్షలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించగా, గేట్‌లో 2023వ ర్యాంక్ ద్వారా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేంద్ర ప్రభుత్వ కొలువుకు ఎంపికయ్యాడు. పట్టణంలో పదో తరగతి వరకు విద్యనభ్యసించగా, ఆ తర్వాత హైదరాబాద్‌లో ఇంటర్, బీటెక్, ఐఐటీ గౌహతిలో ఎంటెక్ పూర్తిచేశాడు. ఒకేసారి రెండు సర్కారు కొలువులు రావడంతో కుటుంబీకులతో ఆయన బంధువులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలియజేశారు.

పిప్పల్‌కోటిలో మహారాష్ట్ర పోలీసుల విచారణ

తాంసి: మహారాష్ట్ర పిప్పల్‌గావ్ అటవీ ప్రాంతంలో భీంపూర్ మండలం పిప్పల్‌కోటికి చెందిన జానకొండ నారాయణ (38) మృతదేహం కాలిపోయిన స్థితిలో గుర్తించిన విషయం తెలిసిందే. కాగా, సోమవారం పిప్పల్‌కోటిలో మహారాష్ట్రలోని కిన్వట్‌లోని డీఎస్పీ సీఐ, మాండ్వి పోలీసులు విచారణ చేపట్టారు. ఇది హత్యానా లేక ఆత్మహత్యనా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం ఆధారంగా హత్యగానే తేల్చినట్లు భావిస్తున్నారు. నారాయణ భార్య విజయలక్ష్మిని అదుపులోకి తీసుకున్నారు. నారాయణ ఆత్మహత్యనా లేక హత్య చేశారా అని గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

ఉరిశిక్ష పడే వరకు పోరాడతాం



గాదిగూడలోని కుమురం భీం చౌక్ వద్ద ఆదివాసీ గిరిజనుల నిరసన

ఆదిలాబాద్‌రూరల్/నార్నూర్(గాదిగూడ): జైనూర్‌లో ఆదివాసీ మహిళపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి ఉరిశిక్ష పడేవరకు పోరాడతామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) మహిళా విభాగం జిల్లా కన్వీనర్ గోడం రేణుక తెలిపారు. సోమవారం మావల మండలం బట్టిసావర్‌గాం శివారులోని కుమురం భీం కాలనీలో ఆమె మాట్లాడారు. జైనూర్‌లో ఏజెన్సీ ప్రాంతం చట్టానికి అనుగుణంగా 1950 తర్వాత వలస వచ్చిన వారిని ప్రభుత్వం వెంటనే తరలించాలన్నారు. వారి భూ యజమాన్య హక్కు, ఆధార్, రేషన్, ఓటర్ ఐడీ కార్డులు, వాణిజ్య వ్యాపార హక్కులు రద్దు చేయాలన్నారు. జైనూర్ ఘటనలో ఆదివాసీలపై ఎదురుదాడి చేసిన వారిపై అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు నమోదు చేయాలన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపించి నిందితుడికి ఉరిశిక్ష పడేవరకు ఆదివాసీలంతా ఉద్యమిస్తామని ఝరి రాయిసెంటర్ సార్‌మెడి మందాడి దౌలత్ రావు, డోకారి(కే) మాజీ సర్పంచ్ మెస్రం దేవరావు తెలిపారు. గాదిగూడలోని కుమురం భీం చౌక్ వద్ద, లోకరి(కే) గ్రామ ప్రధాన రహదారి వద్ద నిరసన తెలిపారు. సమావేశంలో మహిళా విభాగం జిల్లా కో కన్వీనర్ ఉయిక ఇందిరా, మావల మండల అధ్యక్షురాలు కుమ్ర శాంతాబాయి, ప్రధాన కార్యదర్శి మడావి అనుసూయ, జంగుబాయి, కమల, చంద్రకళ, గితేదారి కొడప జాకు, మాజీ ఎంపీటీసీ సీడాం నాగరావ్, కుడ్మేత భారత్, తాజా మాజీ సర్పంచ్ మెస్రం జైవంత్ రావు, కుంరం శంకర్, నాయకులు పేందుర్ మరోతి, చిక్రం నాగరాజ్, 9 తెగల ఆదివాసీ గిరిజనులు పాల్గొన్నారు.

రిమ్స్ బాత్రూంలో జారిపడి క్రికెటర్ మృతి



శ్రీహరి (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన క్రికెటర్ (చిన్ను) శ్రీహరి (30) రిమ్స్ ఆస్పత్రి బాత్రూంలో జారిపడి మృతిచెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాలు..తన కుమారుడికి జ్వరం రావడంతో రిమ్స్‌లో ఇటీవల రక్తనమూనాలు ఇచ్చాడు. రిపోర్టు కోసం సోమవారం ల్యాబ్‌కు వెళ్లాడు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు బాత్రూమ్ వెళ్లగా కాలుజారి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అటువైపుగా వెళ్తున్న వారు గమనించి సిబ్బందికి తెలియజేశారు. అప్పటికే మృతిచెందినట్లు పేర్కొన్నారు. బాత్రూం అపరిశుభ్రంగా ఉండడంతోనే కుమారుడు మృతిచెందినట్లు పేర్కొన్నారు. కాగా మృతుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతితో తోటి క్రీడాకారులు కన్నీరుమున్నీరయ్యారు. క్రీడాకారుడి మృతిపట్ల బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. క్రీడా పోటీలు జరిగిన సమయంలో పలు సందర్భాల్లో ఆయన తన చేతుల మీదుగా బహుమతులు అందుకున్నట్లు గుర్తుచేశారు.

ట్రిపుల్‌ఐటీలో ముగిసిన ఆందోళనలు



విద్యార్థులతో వీసీ వెంకటరమణ

- విద్యార్థులతో సమావేశమైన అధికారులు
- దశలవారీగా సమస్యల పరిష్కారానికి హామీ

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో సమస్యల పరిష్కారం కోరుతూ విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు ముగిశాయి. తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి నిరసన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిరవధికంగా జరిగిన నిరసనలకు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మద్దతు ప్రకటించారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ విద్యార్థుల సమస్యలపై ఉన్నతాధికారులతో సోమవారం మాట్లాడారు. ఇటీవలే నిర్మల్‌కు వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబుతోనూ ట్రిపుల్‌ఐటీ ఇబ్బందులపై చర్చించారు. తాజాగా సోమవారం ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ ట్రిపుల్ ఐటీలో అడ్మినిస్ట్రేషన్, చీఫ్ వార్డెన్, స్టూడెంట్ వెల్ఫేర్‌తో పాటు ఇతర అధికారులతో కలిసి విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల డిమాండ్లపై చర్చించారు. రెగ్యులర్ వీసీతో పాటు హాస్టల్ మరమ్మతులు, వైఫై సమస్యలు, సెంట్రల్ లైబ్రరీ, ఆసుపత్రి, ఆర్థిక వ్యవహారాల లావాదేవీలు, గడువు ముగిసిన టెండర్లు, మెస్ నిర్వహణ, ఇతర అంశాలపై చర్చించి దశలవారీగా పరిష్కారానికి హామీ ఇచ్చారు. త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ తెలిపారు. శాంతియుత వాతావరణం నెలకొనేలా చూడాలని కోరారు. ప్రభుత్వంలోని ఉన్నతాధికారులతో చర్చించి ఈ సమస్యలను పరిష్కరించేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని అధికారులు హామీ ఇవ్వడంతో విద్యార్థులు శాంతించారు.

ట్రిపుల్‌ఐటీ అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరపాలి



సర్దార్ వినోద్‌కుమార్

భైంసా: బాసర ట్రిపుల్ ఐటీలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరపాలని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు సర్దార్ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు రోజులుగా తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్నా ఎవరూ స్పందించడంలేదన్నారు. పైగా ఇక్కడి అక్రమాలు కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వంతో పాటు ఉన్నతాధికారులను క్యాంపస్ అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులు నిరసనలు చేస్తే మద్దతుగా వెళ్తున్న విద్యార్థి సంఘాల నాయకులను లోనికి అనుమతించడం లేదన్నారు. ట్రిపుల్‌ఐటీలో జరిగిన అక్రమాలపై తన వద్ద పూర్తిస్థాయి ఆధారాలు ఉన్నాయని, త్వరలో విద్యార్థి సంఘాలతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



అర్జీలు స్వీకరిస్తున్న ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల ప్రజలు, గిరిజనుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి వెంటనే అర్హులకు న్యాయం చేయాలన్నారు. కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్‌డీసీ గంగాధర్, ఏవో రామోదర్, పీహెచ్‌వో సందీ, జేడీఎం నాగభూషణం, పెసా కోఆర్డినేటర్ వసంత్‌రావు, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు తదితరులు పాల్గొన్నారు.

- ఉపాధి కోసం రుణం ఇప్పించాలని ఉట్నూర్ మండలం రాంజీగోండు గ్రామానికి చెందిన మణికుమార్ విన్నవించాడు.
- ఉట్నూర్‌కు చెందిన రాధ తన హోటల్ కోసం రుణం ఇప్పించాలని అర్జీ అందించింది.
- సీఆర్టీ ఉద్యోగం కల్పించాలని హాజీపూర్ మండలం పెద్దమ్మపేట గ్రామానికి చెందిన సరోజ వేడుకుంది.
- ఏఎన్‌ఎం ఉద్యోగం ఇవ్వాలని నేరడిగొండ మండలానికి చెందిన కవిత అర్జీ అందించింది.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



నర్సయ్య మృతదేహం

భైంసారూరల్: ఉపాధి కోసం దుబాయ్ వెళ్లి అనారోగ్యంతో మృతిచెందిన నర్సయ్య మృతదేహం స్వగ్రామమైన కోతల్‌గాంకు చేరుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాలు.. సట్ల నర్సయ్య (50) ఉపాధి కోసం ఏడాది క్రితం దుబాయ్ వెళ్లాడు. అక్కడే పని చేస్తున్నాడు. గతనెల 22న అనారోగ్యంతో మృతిచెందాడు. గతంలో వ్యవసాయ పనులు చేసేవాడు. పంటలు పండక కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. అవి తీర్చేందుకు దుబాయి వెళ్లాడు. ఏడాదిగా బాగానే పనిచేసుకున్నాడు. అస్వస్థతకు గురైన ఆయన గతనెలలో మృతిచెందాడు. కుటుంబీకులకు ఈ విషయం తెలియడంతో మృతదేహం స్వగ్రామానికి రప్పించాలని వేడుకున్నారు. మృతదేహం సోమవారం ఇంటికి చేరుకోగానే కుటుంబీకులు రోదించారు. అనంతరం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.